అభిమానాన్ని ప్రతి క్షణం తన మాటల్తో గాయపరిచాడు. అన్నీ భరించాను. నేను నా గౌరవాన్ని చంపుకొని నా చెల్లి పెళ్ళి కోసం డబ్బును అప్పుగా ఇవ్వమని అడిగితే ఏమన్నాడో తెలుసా బాస్.....

"ఎందుకురా అంత తొందరపడుతున్నావ్? ఏ దాని క్యారెక్టర్ మంచిది కాదా?"

ఆ మాటలే బాస్ వాడన్నది... ఈ ప్రపంచంలో అందరూ అందుకే తమ బిడ్డల పెళ్ళిళ్ళ కోసం ఆరాటపడుతున్నారా? ఈ ప్రపంచంలో నాకుంది వాళ్ళే బాస్. నేను చేసింది మంచా, చెడా అనేది నేను చెప్పలేను. కానీ వాడిలాంటి వారున్నంత కాలం నాలాంటి వారూ ఉంటారు." అన్నాడు.

చాలాసేపు మా ఇద్దరి నడుమా నిశ్శబ్దం. సింహం వెళ్ళేముందు అడిగాను-

"ఇంతకూ ఎవరా వ్యక్తి?"

"మా మేనమామ బాస్." అన్నాడు నిశ్శబ్దంగా నవ్వుతూ!

• • •

"సంబరం"

"ఏంటి? ఇంత సంతోషంగా ఉన్నారు. మీ నెక్లేస్ దొరికిందా?" అడిగింది పద్మ.

"కాదు. ఎదురింటి సావిత్రి నెక్లేస్ కూడా పోయిందని" సంబరంగా చెప్పింది రాణి.

"నొప్పి"

ఇంతకూ మీరిచ్చిన టాబ్లెట్లు తలనొప్పికా? లేక కడుపు నొప్పికా?" అనుమానంగా అడిగాడు శ్రీను.

"ఇవ్వాళేమొచ్చిన ఏ నొప్పి తగ్గిందో నాకొచ్చి చెప్పు" చిరాగ్గా అన్నాడు డాక్టర్ శంకర్రావు.

ఇస్తా!!

"ఆ రమేష్ తనతో ఓ సంవత్సరం తిరిగితే కారు ఇస్తానన్నాడు" శ్రీనుతో అంది పద్మ.

"ఓ... అంతేనా? నాతో ఓ సంవత్సరం తిరుగు. ఓ బుల్లిబాబునిస్తా" గొప్పగా అన్నాడు శ్రీను.

వెతుక్కుతున్నా!

"'పారిపోయిన భార్య' అనే నవల వ్రాసింది మీరేనా?" అడిగాడు ఓ పాఠకుడు.


"అవును" అన్నాడు రచయిత.

"ఇప్పుడేం చేస్తున్నారు మరి?"

"పారిపోయిన నా భార్యను వెతుకుతున్నా" వినయంగా చెప్పాడు.

-పద్మశ్రీ (మాటూర్గం)






# ఆఖరి దొంగతనం

ప్రతాప రవిశంకర్

రాత్రి ఏడు గంటలు కావస్తున్నప్పుడు అద్దం ముందు నిలబడి తల దువ్వుకుంటున్నాడు దుష్యంతరావు. ట్యూబ్‌లైట్ కాంతి గదినంతటినీ పరచుకున్నది. పైన ఫ్యాన్ గిర్రున తిరుగుతున్న చప్పుడు తప్పించి అంతా నిశ్శబ్దంగా వుంది.

"ఏం చేస్తున్నావ్ డియర్?" అన్నాడు అతను తలదువ్వటం ముగించి వెనక్కు తిరుగుతూ-

అతడి భార్య రాజేశ్వరి బెడ్‌మీద వెల్లికిలా పడుకుని ఏదో వార పత్రికను చదువుతోంది..

"కథ చదువుతున్నాను" అన్నది చదుదుతూనే-

"ఏం కథ?" దగ్గిరగా వస్తూ అడిగాడు.

"దొంగ కథ."

"యూజువల్ ....జాగ్రత్తగా మాట్లాడు."

ఉలిక్కిపడి చేతిలో పత్రికను వదిలేసింది రాజేశ్వరి..

దుష్యంతరావు మొహం ఇది వరకట్లా లేదు. కొంచెం సీరియస్‌గా వుంది..

"ఎందుకలా అరిచారు?" చిన్నగా అడిగింది..

"నా గురించే కదూ నువ్వు-దొంగ కథ-అన్నది." కోపంగా అడిగాడు అతను.

రాజేశ్వరి పెద్దగా నవ్వి "ఉహు..కాదు.." అంటూ పత్రికను తెరిచి అతడికి చూపించింది.


"సారీ రాజేశ్వరి" అన్నాడు దుష్యంతరావు పత్రికలో-దొంగ కథ-పేరు చూసి..

"ఈ కథ మనకథలాగేవుంది" అన్నది ఆమె.

"ఎలా?" భార్య పక్కనే కూర్చుంటూ అడిగాడు.

"ఉద్యోగం దొరక్క మీలాంటి ఓ యువకుడు అవసరానికి ఓ చిన్న దొంగతనం చేస్తాడు. అతడి అవసరం తీరుతుంది. ఆ తర్వాత మళ్లీ చేస్తాడు. మళ్లీ చేస్తాడు అవసరానికి తలవొంచి. చివరికి అదే ఉద్యోగంగా మారిపోతుంది.





అతను దొంగగా మారిపోతాడు. ఐతే అదృష్టం అతన్ని వదలకపోవటం వల్ల అతనెప్పుడూ పోలీసులకు దొరికిపోడు. కొన్నాళ్లకు అతనికి పోలీసు డిపార్టుమెంటులోనే ఉద్యోగం వస్తుంది. వెంటనే అతను ఇక దొంగతనాలు చెయ్యాల్సిన అవసరంలేదని ఆ పని మానేసి ఉద్యోగిగా కొత్త జీవితాన్ని మొదలు పెడతాడు. ఇదీ దొంగ కథ."

పెద్దగా నవ్వాడు దుష్యంతరావు."

"ఎందుకు నవ్వుతున్నారు?"

"దొంగకు పోలీసు డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం రావటమా?"

"ఎందుకు రాకూడదు? అతను దొంగని ఎవరికీ తెలీదు. చదువుకున్నవాడు, తెలివి వున్నవాడు. అందుకే అతడికి ఉద్యోగం వచ్చింది. నాకేమీ ఆశ్చర్యంగా అనిపించలేదు. కథ చాలా సహజంగా అనిపించింది." అన్నది రాజేశ్వరి.

"ఇంతకీ-దొంగ కథ-మనకథలాగా ఎలా వుంది?"

"ఆ కథలో యువకుడిలాగే మీరు కూడా-" ఆగిపోయింది రాజేశ్వరి.

"అవును రాజేశ్వరి.. నేనుకూడా దొంగనే.. చదువుకున్నవాడిని, ఉద్యోగం దొరక్క దొంగగా తయారయినవాడిని.... నాకూ బాధగానే వుంది." విచారంగా అన్నాడు దుష్యంతరావు..

"ఎన్నాళ్లీ దొంగబతుకు'? అన్నదామె భర్త కళ్లలోకి చూస్తూ.

"త్వరలోనే ఈ జీవితానికి చుక్క పెడదామనుకుంటున్నను. ఇప్పటిదాకా అదృష్టం మనవైపునే వున్నది. అందుకే ఇన్ని దొంగతనాలు చేసినా ఒక్కసారి కూడా ఎక్కడా దొరికిపోలేదు. కాని ఎప్పుడో ఓసారి ఈ అదృష్టం మొహం చాటు చేసినప్పుడు మనిద్దరి బతుకులూ కాలిపోయినట్టే........"

ఒక్క నిముషం రాజేశ్వరి ఏమీ మాట్లాడలేకపోయింది..

పెళ్లికి ముందు దుష్యంతరావు తనో దొంగ అనే నిజాన్ని నిజాయితీగా రాజేశ్వరితో చెప్పాడు. ఐతే ఏ పరిస్థితుల్లో తను దొంగ జీవితాన్ని మొదలు పెట్టాడో ఎంతో వివరంగా చెప్పాడు. కొద్ది రోజుల్లో ఆ జీవితానికి తెర దించబోతున్నట్టు కూడా చెప్పాడు. రాజేశ్వరి అతడి మాటలను నమ్మింది. అతడి మాటల్లోని నిజాయితీని విశ్వసించింది- అతడితో మూడుముళ్లు వేయించుకోటానికి తలవంచింది.

ఆమెకీ ఎవ్వరూలేరు. ఎవరో దూరపు బంధువులింట్లో పనిమనిషి హోదాలో పెరిగింది..

"ఏమిటీ ఆలోచిస్తున్నావు?" అడిగాడు అతను-ఆమెను.

"మన పెళ్లయి ఏడాదికావ స్తోంది." ఇంకా మీరు దొంగతనాలు మానెయ్యలేదు."

ఆమె మీదకు వొంగి "రాజేశ్వరీ... ఇదే చివరి దొంగతనం... ఇప్పటికి దొంగతనాలు చేసి బాగనే సంపాదించాను. ఆ డబ్బుతో ఏదయిన బిజినెస్ చేస్తాను.. అప్పుడు మనం భయంలేని బతుకును ఆహ్వానించ వచ్చు..." అన్నాడు ఉత్సాహంగా..

"నిజంగా ఇవాళ మీరు చేసుకు వచ్చేది ఆఖరు దొంగతనమా?!" ఆశగా అడిగిందామె–

"అవును..ప్రామిస్" అన్నాడు దుష్యంతరావు.

"ఏమిటి వళ్లపాడా?" అన్నది రాజేశ్వరి నవ్వుతూ

"కాదు.. వాగ్దానం.. ఇవాల్టిదే ఆఖరి దొంగతనం.. నాలుగు రోజుల్నించీ ఇవాల్టి దొంగతనానికి ప్లాన్ చేశాను...

తప్పకుండా విజయలక్ష్మి ఎవరు? ఆమెనేనా మీరు చివరిసారిగా దొంగతనం చేసి తీసుకువచ్చేది?" కళ్లను పెద్దవి చేస్తూ అడిగిందామె–

"యూ సిల్లీ" అంటూ భార్య బుగ్గ మీద చిటికవేశాడు దుష్యంతరావు.

"భోజనం చేద్దామా ఆకలవుతోంది." అన్నది బెడ్ మీదనించి దిగుతూ...

తలవూపాడతను నిల్చుంటూ...

రాజేశ్వరి వంట గదిలోకి వెళ్లింది–

అతను కిటికీ దగ్గరకు వెళ్లి బయటకు చూస్తూ నిల్చున్నాడు.

దుష్యంతరావును ఎవ్వరూ దొంగ అనుకోరు. అతను ఏదో ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నట్టుగా అందరినీ నమ్మిస్తున్నాడు. ఆఫీసుకు వెళ్లే ఉద్యోగిలాగే ఉదయం తొమ్మిది గంటలకు ఇంట్లో బయల్దేరుతాడు. సాయంత్రం ఆరున్నర కల్లా ఇంటికి వస్తాడు. సెలవు రోజుల్లో ఇంట్లోనే గడుపుతాడు. అప్పుడప్పుడు బయట నించి వస్తూ లోపల కాయితాల్లేని ఫైళ్లు ఇంటికి తీసుకు వస్తూవుంటాడు. దుష్యంతరావు గొప్ప నటుడు.


రాజేశ్వరి పిలిచింది.

అతను వెళ్లాడు.

ఇరవై నిముషాల తర్వాత ఇద్దరూ కిచెన్‌లోనించి బయటకు వచ్చారు.

అతను సిగరెట్టు ముట్టించాడు. ఆమె టేబుల్ మీద వున్న పేక అందుకున్నది.. రాత్రి పది గంటలవరకు ఇద్దరూ పేకాడుతూ కూర్చున్నారు.

పదిగంటలకు దుష్యంతరావు లేచి దొంగతనానికి బయల్దేరాడు. అవసరమైన పరికరాలన్నీ జేబుల్లో పెట్టుకుని రాజేశ్వరి







బుగ్గ మీద చిటిక వేసి "ఇదే ఆఖరి దొంగతనం" అన్నాడు.

"జాగ్రత్త" అన్నది..

"నువ్వు కూడా జాగ్రత్త.. ఎలర్టుగా వుండు. రాత్రి ఏ టైములో ఐనా వచ్చి తలుపుకొడతాను. మరీ మొద్దు నిద్రపోకు... బై." అని బయటకు వెళ్లిపోయాడు.

గేటుదాటి అతను రోడ్డు మీదకు వెళ్లేవరకు అక్కడే నిలబడింది ఆమె. తర్వాత తలుపులవు మూసి కిటికీ దగ్గరకు వచ్చి నిలబడింది..

రోడ్డు మీద ఎవ్వరూ తిరగటంలేదు. చలికాలం కావటంతో ఇళ్ల తలుపులు మూసి వున్నాయి. కొంచెం దూరంలో వున్న మెయిన్ రోడ్డుమీద మోటారు వాహనాలు తిరుగుతున్న చప్పుడు వినవడుతోంది..

ఆఖరి దొంగతనంలో ఎవరికీ దొరికి పోకుండా అతను రాగలడా? అదృష్టం ఇంకా తన భర్తను అంటిపెట్టుకునే వుందా?

కిటికీ దగ్గర్నించి కదిలి ఈ వూహాల్ని తట్టుకోలేక లైటార్పి బెడ్‌మీద పడుకుని కళ్లు మూసుకుంది రాజేశ్వరి... ఆమె కళ్ల ముందు ఇద్దరు పోలీసులు దుష్యంతరావును తుపాకులతో వెంటపడుతున్న దృశ్యం కనవడింది.

* * *

"రాజేశ్వరీ" తలుపులమీద తట్టాడు దుష్యంతరావు. అప్పుడు రాత్రి రెండున్నర దాటుతోంది.

రాజేశ్వరి పలకలేదు.

అతను మళ్లీ పిలుస్తూ ఇంకొంచెం గట్టిగా తలుపుకొట్టాడు.

తెరుచుకుంది...

ఆశ్చర్యంగా లోపలకు వచ్చి లైటు వెలుతుర్లో బెడ్‌మీద పడివున్న రాజేశ్వరిని చూసి మళ్లీ ఆశ్చర్యపోయాడు.

ఆమె కాళ్లు–చేతులు కట్టేసి వున్నాయి.

నోటికి టేప్ అతికించబడివుంది. కళ్లు తెరుచుకుని చూస్తోంది.

"ఏమిటి రాజేశ్వరీ? ఏం జరిగింది?" ఆత్రంగా అడిగాడు అతను కట్లు వూడదీస్తి– టేపు పీకి.

ఒక్క నిమిషం ఆగి– "గంట క్రితం తలుపు మీద కొట్టిన చప్పుడయ్యింది. మీరే అనుకుని తెరిచాను. కాదు, ఎవరో యువకుడు మీలాగే వున్నాడు. ఎవరని అడిగితే దొంగనని చెప్పాడు. కత్తితో బెదిరించి కాళ్లు చేతులూ కట్టి నగలన్నీ లాక్కున్నాడు. ఇల్లంతా తిరిగాడు. డబ్బు తీసుకున్నాడు."

"నా గురించి చెప్పలేదా? ఇది కూడా ఓ దొంగ ఇల్లనీ దోచుకోవద్దనీ నువ్వు చెప్పలేదా?"

"చెప్పాను. దొంగల్లో నిజాయితీ ఏమిటి? దొరికింది దోచుకోవటమే దొంగ పని... అన్నాడతను... ఆశ్చర్యంమేమిటంటే అతనికి ఇది ఆఖరి దొంగతనం అని చెప్పాడు."

"ఏమిటీ! వాడిక్కూడా ఇది ఆఖరి దొంగతానమన్నాడా?!"

"అవును.. మీరు పెళ్లయిన తర్వాత దొంగతనం మానెయ్యాలనుకున్నారు, కాని అతను పెళ్లికి వుండే దొంగతనాలు మానెయ్యాలనుకున్నాడుట. అతనుకూడా నిరుద్యోగి.. అవసరాల కొద్దీ దొంగతనం మొదలుపెట్టి బాగానే సంపాదించాడట. అతను ఈ మధ్యనే కామేశ్వరి అనే అమ్మాయిని ప్రేమించాడట. దొంగతనాలు మానేస్తే కానీ అతన్ని పెళ్లి చేసుకోనని గట్టిగా చెప్పిందిట ఆ అమ్మాయి. ఇదే ఆఖరి దొంగతనమని ఆ అమ్మాయికి ప్రామిస్ చేసి మనింటికి దొంగతనానికి వచ్చాడుట. వెళుతూ నేను అరిచి ఎవర్నీ పిలవకుండా నోటికి టేపు అంటించి వెళ్లిపోయాడు. ఆశ్చర్యంగావుంది కదూ ఈ దొంగ కథ?" అన్నది రాజేశ్వరి అంతా చెప్పి...

"అవును... ఒక దొంగ ఇంటిని మరో దొంగ దోచుకోవటం గురించి నేనెప్పుడూ వినలేదు. నిజానికి ఈ విషయాన్ని పేపర్లో వేయించవచ్చు... కానిమనం దొరికిపోతాం..' అంటూ లేచి వెళ్లి తలుపులు మూసి బోల్టువేసి గోడవారీగా జారవిడిచిన సూట్కేసును తీసుకు వచ్చి బెడ్ మీద పడేశాడు...

"ఇంతకీ మీ ఆఖరి దొంగతనం ఏమయ్యింది?" అడిగిందామె...

"చూడు డియర్ నీకే తెలుస్తుంది." అంటూ సూట్కేసు తెరిచి అందులో వున్న వస్తువులన్నింటినీ పక్క మీదకు వొంచాడు...

వెండి-బంగారు నగలతోపాటు అందంగా వున్న ఓ పర్సు కూడా సూట్కేసులోనించి పడింది..

దాన్ని తీసుకుని తెరిచి అదో రకంగా అరిచింది రాజేశ్వరి...

ఉలిక్కిపడి "ఏమిటీ? ఎందుకు అరిచావ్?" అన్నాడు దుష్యంతరావు...

ఆమె-అతడికి ఆ పర్సులో వున్న ఫోటోను చూపిస్తూ "ఇతనే మనింట్లో ఆఖరి దొంగతనం చేసిన యువకుడు" అన్నది.

"మై గాడ్-" అన్నాడు దుష్యంతరావు ఆశ్చర్యంతో..

** ** **

"గొడవేంది?"

"నువ్వూ, నీభార్య అలా. ప్రతిరోజా గొడవలు పడేబదులు రాజీకి వస్తే బావుంటుంది కదా?"
"నేనూ అదే అంటున్నా"
"మరి మీ ఆవిడ ఒప్పుకోదా"
"అందుకే ప్రతిరోజా ఈ గొడవ"

"అంత దూరమా?"

ఏడుస్తూ భర్తతో అంది కాంతం.
"ప్రతిరోజా అంతదూరం బార్‌కి వెళ్ళి తాగడం ఆరోగ్యానికి మంచిదనుకుంటున్నారా?"
"నేనూ అదే ఆలోచిస్తున్నా"
"తాగుడు మానేస్తున్నారా?"
"అబ్బే రేపటినుండి అంత దూరం వెళ్ళను. ఇంటికే తెచ్చేసుకుంటాను".

-కె.వి.మధుసూదనరావు.



# 'ఆదివారం కథల' పోటీ

మొదటి బహుమతి రు. 500
రెండవ బహుమతి రు. 300
మూడవ బహుమతి రు. 200
కన్సొలేషన్ (2) రు. 200

'ఆదివారం కథలేమిటి?' అని ఆశ్చర్యపడుతున్నారా? అవును. ఆదివారం కథలే. నిద్ర లేచింది మొదలు, అర్ధరాత్రివరకు మనుషులు విరామం, విశ్రాంతి లేకుండా యంత్రాల్లా పని చేయవలసిన ఈ యాంత్రిక యుగంలో, ఒక్క క్షణకాలం విశ్రాంతి దొరికేది ఆదివారం నాడే. మిత్రులతో, బంధువులతో కాలక్షేపం చేయడానికి వీలైంది ఒక్క ఆదివారంనాడే. పెళ్ళికానివారైతే తను ప్రేయసీ ప్రియులను కలుసుకోవాలని ఉబలాటపడడానికి అవకాశం యిచ్చేది ఆదివారమే. అందుకే ఆదివారం